క్లుప్తంగా

ఉద్యోగాలు పొందడం అభినందనీయం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం అభినందనీయమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ఉద్యోగాలు పొందిన పలువురు విద్యార్థులను పూర్వ ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండారం పాఠశాలలో తాము ఉపాధ్యాయులుగా పనిచేసినపుడు చదువుకున్న విద్యార్థులలో తొమ్మిది మందికి వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు రావడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. ఉపాధ్యాయులు సుజన, వనిత, చంద్రశేఖర్, ఉద్యోగాలు సాధించిన రూపేష్, గౌరీ, ప్రేమ్, సతీశ్, హర్షవర్ధన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థినులతో పీడీ ఉప్పలయ్య

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన గ్రామస్థాయి సీఎం కప్ పోటీల్లో 200 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కబడ్డీలో నితిన్ టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా.. బాలికల విభాగంలో అర్చన టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఖో ఖో, వాలీబాల్ క్రీడల్లో సైతం విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం పెద్ది విఠల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాస్ఫూర్తి నింపేందుకు ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమాలలో ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బీఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

సిద్దిపేటజోన్: అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బీఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, జీవిత బీమా, ఆరోగ్య బీమా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు రూ.4వేలు పెన్షన్ ఇవ్వడంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు. అనంతరం హమాలి, భవన నిర్మాణరంగం జిల్లా కన్వీనర్‌గా సిద్దిసాగర్‌ను నియమించారు. కార్యక్రమంలో బీఎమ్మెస్ జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన వచ్చింది

హుస్నాబాద్: బీఆర్ఎస్ నిర్బంధ పాలన పోయి కాంగ్రెస్ ప్రజాపాలన వచ్చిందని జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యేడాదిలోనే 55వేల ఉద్యోగాలను భర్తీ చేయడం హర్షణీయమన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు నిరసన తెలిపే ధర్నాచౌక్‌ను పునరుద్ధరించడం శుభ పరిణామమని చెప్పారు. కులాలు, మతాల పేరిట వైషమ్యాలు పెంచే బీజేపీ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు సారయ్య, కొమురయ్య, వీరన్న నాయక్, ప్రకాశ్, మల్లేశం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ సరఫరాచేస్తే కఠిన చర్యలు తప్పవు



కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): పిల్లలు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్ఐ నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పాన్‌షాప్‌లు, కిరాణా దుకాణాలలో నార్కోటిక్స్ డాగ్స్‌తో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు కలిగిన చాక్లెట్స్, ఇతర పదర్థాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవన్నారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం

- సమగ్ర యాజమాన్య పద్ధతులతో చెక్
- మందులతోపాటు వేపనూనె వాడాలి
- మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్



యాజమాన్య పద్ధతులపై రైతుకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: మొక్కజొన్న సాగులో అనేక రకాల చీడపీడలు తరచూ ఆశిస్తూ రైతులకు నష్టం కలిగిస్తాయి. ఇటువంటి వాటిలో కత్తెర పురుగు ప్రధానమైనది. కత్తెర పురుగు మొక్కజొన్న కాండాన్ని తొలుచుకొని తినడం వల్ల కర్ర ఎండిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల సాంద్రత తగ్గి దిగుబడిపై ప్రభావం పడుతుంది. పురుగు మందుల ప్రభావానికి లొంగకుండా కత్తెర పురుగు రోగ నిరోధక శక్తిని అభివృద్ధి చేసుకోవడంతో పురుగును కట్టడి చేయడం రైతులకు సవాలుగా మారింది. కత్తెర పురుగు మొక్కజొన్న రైతులకు కొరకరాని కొయ్యగా మారింది. దీనిని కట్టడి చేయడానికి వారానికి రెండు సార్లు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలని.. లేకుంటే తీవ్రమైన నష్టం చవిచూడవలసి వస్తుందని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచిస్తున్నారు.



కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న చేను



కత్తెర పురుగు

కత్తెర పురుగు వ్యాప్తి...

కత్తెర పురుగు అన్ని కాలాల్లోనూ వ్యాప్తి చెందుతుంది. పురుగు జీవితకాలం వేసవి కాలంలో 30 రోజులు కాగా, మిగిలిన కాలాల్లో 60 రోజుల వరకు ఉంటుంది. ఈ పురుగు ఒక్క పంటను ఆశిస్తే ఆ ప్రాంతంలోని మిగిలిన గ్రామాలకు కూడా వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఒక కత్తెరపురుగు జీవితకాలంలో 1000–1500 వరకు గుడ్లను పెట్టగలదు. అంతే కాకుండా ఈ పురుగు పగటిపూట ఆకుల మధ్యలో ఉండి రాత్రిపూట ఆకులను తిని పంటను నాశనం చేస్తుంది. కాబట్టి పురుగు మందులను సాయంత్రం పూట పిచికారీ చేయడం వల్ల ప్రభావవంతంగా పనిచేస్తుంది.

యాజమాన్య పద్ధతులతో నివారణ

కత్తెర పురుగును నివారించడానికి పురుగుమందులతో పాటు సమగ్ర యజమాన్య పద్ధతులు పాటించాలి. విత్తనం నాటిన రెండు వారాల తరువాత ఒక లీటర్ వేపనూనెను 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలు, నేల మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. దీని వల్ల గుడ్ల నుండి పురుగులు బయటకు రాకుండా నిరోధిస్తుంది. అదేవిధంగా విత్తనం నాటిన 15-20 రోజుల వ్యవధిలో ప్రొఫెనోపాస్ 250 మిల్లీలీటర్లు, ఒక లీటరు వేపనూనె 200 లీటర్ల నీటిలో కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి. 20 నుండి 30 రోజుల మధ్యలో ఎకరానికి ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు, లీటరు వేపనూనెను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ విధంగా మందులను మార్చి మార్చి వాడటం వల్ల మొక్కజొన్నను కత్తెర పురుగు నుండి కాపాడుకోవచ్చు.

గురుకులాల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురామ్



మాట్లాడుతున్న పరశురామ్

హుస్నాబాద్: గురుకులాల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ కోరారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నవంబరు 30నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు గురుకుల బాట కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించామని, అక్కడ నెలకొన్న సమస్యల నివేదికను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వేసిన కమిటీకి అందజేస్తామని చెప్పారు. హాస్టల్ విద్యార్థులకు బెడ్ షీట్స్, యూనిఫామ్స్, స్పోర్ట్స్ దుస్తులు, షూస్ అందించకపోవడం బాధాకరమని, కొన్నిచోట్ల మెనూ సరిగా పాటించడంలేదని వాపోయారు. సమావేశంలో నాయకులు హరీశ్, సతీశ్, సంపత్, నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.



సిద్దిపేటఅర్బన్: తడ్కపల్లి పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అపూర్వకలయిక



కొమురవెల్లి(సిద్దిపేట): 1996-97 బ్యాచ్ విద్యార్థులు..

పలువురు పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఆదివారం కలుసుకొని సందడి చేశారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లిలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివిన 1991–92 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు 33యేళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆనాటి విషయాలను గుర్తుచేసుకొన్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అదే విధంగా కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 27సంవత్సరాల తర్వాత కలుసుకొన్నారు. తమకు విద్య నేర్పిన గురువులు శ్రీనివాస్, శ్రీరాములు, జనార్దన్‌ను సత్కరించారు. వెంకట్‌రెడ్డి, జైన నరేశ్, నాగరాజు, నర్సింహారెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009–10లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకొని సరదాగా గడిపారు.



దుబ్బాక: దుంపలపల్లిలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

చెట్టును ఢీకొన్న కారు

మిరుదొడ్డి(దుబ్బాక): కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మిరుదొడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. కాసులాబాద్‌కు చెందిన అడ్వకేట్ రంగబోయిన నర్సింహులు గజ్వేల్ నుంచి కాసులాబాద్‌కు శనివారం రాత్రి బయలుదేరాడు. ఈ క్రమంలో మిరుదొడ్డిలోని బొమ్మరాజు చెరువుకట్టపై నుండి వెళ్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి గాయపడిన నర్సింహులును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా నిల్వ ఉంచిన 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ బోయిని పరశురాములు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నమ్మదగిన సమాచారం మేరకు తొగుట మండలం వరదరాజుపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పట్టుకున్నామని, మిరుదొడ్డి గోదాంకు తరలించామని ఆయన తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కొండల్



నియామక పత్రం అందుకుంటున్న కొండల్

దుబ్బాకరూరల్: ఎమ్మార్పీఎస్ అక్బర్‌పేట భూంపల్లి మండల అధ్యక్షుడిగా కాకి కొండల్ మాదిగను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధికార ప్రతినిధిగా కృపాకర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కార్యదర్శి యాదగిరి నియామకమయ్యారు. అదే విధంగా ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా స్వామి, అధికార ప్రతినిధిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కార్యదర్శిగా నాగరాజు తదితరులను ఎంపికచేశారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులను సన్మార్గంలో పెట్టే ఉపాధ్యాయుడిపైనే దాడిచేయడం హేయమైన చర్య అని, దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, వెంకటనర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బస్టాండ్‌లో.. ధాన్యం ఆరబోత



బస్టాండ్‌లో ఆరబోసిన ధాన్యం

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండాల్సిన బస్టాండ్ వినియోగంలోకి రాకపోవడంతో రైతులు ధాన్యం ఆరబోయడానికి వినియోగిస్తున్నారు. అలాగే గ్రామాల్లో జరిగే పంచాయితీలకు, రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారింది. ధాన్యాన్ని ఆరబోయడానికి కల్లాలు లేకపోవడం, కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా స్థలం లేని కారణంగా చిన్నకోడూరులో రైతులు బస్టాండ్‌లోనే ధాన్యం ఆరబోస్తున్నారు.
– చిన్నకోడూరు(సిద్దిపేట):

విగ్రహం అంశంపై రాద్ధాంతం తగదు

కాంగ్రెస్ నేత అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ తల్లి విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని ఏడాదిలోనే చేసి చూపించామన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజొద్దీన్, కిషన్, బాబా, నజ్జు, ఫయాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి నోచుకోని ఐఓసీ భవనం

ఐఓసీకి మోక్షం ఎప్పుడు?

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వశాఖలకు సంబంధించిన అన్ని భవనాలు ఒకేచోట ఉండాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం సమీకృత భవనాలకు(ఐఓసీ)లకు శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలో సమీకృత భవనం నిర్మాణం కోసం రూ.10కోట్లు మంజూరు చేసింది. వెంటనే సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. యేదాది క్రితమే భవనం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): గర్భగుడిలో కొలువైన చాముండేశ్వరి అమ్మవారు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్ల పోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విష్ణుశ్ నల్లపోచమ్మకు పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ఆదివారం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

గవ్వలపల్లిలో క్షయవ్యాధిపై అవగాహన



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి పల్లె దవాఖానలో ఆదివారం క్షయవ్యాధిపై డాక్టర్ హరీశ రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వరుసగా జ్వరంతో బాధపడుతున్న వారు తెమడ పరీక్ష చేసుకోవాలని, దీని ద్వారా టీబీ ఉందా లేదా అని తెలుస్తుందన్నారు. అనారోగ్యం పాలైనవారు, శారీరకంగా, ఆరోగ్యంగా రోగనిరోధక శక్తిని కోల్పోయిన వారికి తొందరగా టీబీ వచ్చే అవకాశం ఉందన్నారు. టీబీ వచ్చినవారు కూడా ఎలాంటి ఆందోళన చెందకుండా డాక్టర్ల సలహాలతో మందులు వాడుతూ.. సరైన పౌష్టికాహారం తీసుకున్నట్లైతే ఆరోగ్యానికి మంచిదన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..



దుబ్బాకటౌన్: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన జిల్లా జనరల్ సెక్రెటరీ కొంగరి అమరేందర్‌రెడ్డిని, దుబ్బాక నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్‌ను, దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడవెర్గు గోపి, డాకూరి శ్రీకాంత్ రెడ్డిని ఆదివారం సన్మానించారు.

◆ అంబులెన్స్ సేవలు షురూ..

మద్దూరు(హుస్నాబాద్): మండలానికి ప్రభుత్వం నూతనంగా 108 అంబులెన్స్‌ను కేటాయించింది. ఆదివారం అంబులెన్స్ మండల కేంద్రానికి చేరుకుంది. ఇంతకాలం అంబులెన్స్ సౌకర్యం లేక పోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు అంబులెన్స్ వాహనం రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఔదార్యం చాటుకున్న స్నేహితులు



మిరుదొడ్డి(దుబ్బాక): ఆకస్మికంగా మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధిలోని కాసులబాద్‌కు చెందిన భూపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 1990– 91బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు ఆదివారం రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మరో మిత్రుడు భూపాల్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.2వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాలరాజు, స్నేహితులు ర్యాకం మల్లేశం, రాందేవ్ చంద్రశేఖర్, ఎండీ అహ్మద్, గున్నాల ముత్యం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతిపక్షాలపై విమర్శలు సరికాదు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీల అనుమతులు రద్దు చేయమంటే ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకులకు సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కనగండ్ల తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యాక్టరీలకు ఇచ్చిన అనుమతుల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రతిపక్షాలను విమర్శించి లబ్ధి పొందాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

◆ అనాథ యువతి వివాహానికి సాయం



గజ్వేల్: మండలంలోని అహ్మదీపూర్‌లో అనాథ యువతి అందోలు అలేఖ్య వివాహానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆదివారం రూ.10వేల సాయం అందించారు. చిన్న వయసులోనే తల్లిదండ్రుల మరణించడంతో అలేఖ్య అనాథగా మారింది. అలేఖ్య సంరక్షకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ విజయోత్సవాలకు హాజరుకండి



హుస్నాబాద్‌రూరల్: మండలంలోని వంగరామయ్యపల్లిలో సోమవారం నిర్వహించే ప్రజా పాలన విజయోత్సవాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు ఆదివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కూడా ఘనంగా జరపనున్నట్లు చెప్పారు.

◆ బీరుబాటిల్‌లో పురుగులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వైన్స్ షాప్‌లో ఆదివారం బీరు బాటిల్‌లో పురుగులు ఉన్నాయని కొందరు గుర్తించారు. దీంతో వైన్స్ యజమానులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.